క్లుప్తంగా

మెరుగైన పారిశుధ్యంతోనే ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇళ్ల మధ్య నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బు రోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. దీని వల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. వర్షాకాలం సీజన్ దృష్ట్యా అంటు వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ కమలకుమారి

రాజోలు: రాష్ట్ర స్థాయి ఉపన్యాస, వ్యాచరచన పోటీలకు రాజోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు జె.కీర్తన ఎస్.రత్నవల్లీ, జె.స్నేహిత, తొమ్మిదో తరగతి విద్యార్థినులు సీహెచ్ వసంతలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, ఎం.జోయల్‌మెర్సీ గెలుపొంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డీఈఓ కమలకుమారి, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు వీరికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఉచిత వైద్య సేవలు



పాశర్లపూడిలంకలో వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతమైన శ్రీరామ్‌పేటలో శుక్రవారం లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు రమ్యశైలజ, స్పందన ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. శిబిరాన్ని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, వీఆర్వో వీఎస్ఆర్ఎస్ రాయుడు సందర్శించారు.

ఉపాధ్యాయులను ఎన్నటికీ మరువలేం



కిడ్నీ బాధితుడికి సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

పి.గన్నవరం: విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులను సమాజం ఎన్నటికీ మరువదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక సాయితేజ విద్యాసంస్థల కరస్పాండెంట్ అన్నాబత్తుల వీర రాఘవ హనుమాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూలు ప్రిన్సిపాల్ సుంకర వెంకట కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎల్.గన్నవరానికి చెందిన కొల్లు రవీంద్రకు ఎమ్మెల్యే రూ.10 వేల సాయాన్ని అందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకులు

పి.గన్నవరం: విజయవాడలో వరద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులు, వాటర్ బాటిళ్ల కిట్లను వాహనాల్లో తరలించారు. తన కార్యాలయం వద్ద జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సీఐ ప్రశాంత్‌కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గణపతి బొప్పా మోరియా

- నేడు వినాయక చవితికి సర్వం సిద్ధం
- నవరాత్ర ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు
- భారీగా ఉత్సవ పందిళ్ల ఏర్పాటు
- కొనుగోలుదార్లతో మార్కెట్ల కళకళ



ఆలమూరు మార్కెట్‌లో విక్రయిస్తున్న రంగుల విగ్రహాలు



మామిడికుదురు మార్కెట్‌లో దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ

కొత్తపేట: హిందూ సంప్రదాయ ప్రధాన పండగల్లో ఒకటైన వినాయక చవితిని ఘనంగా జరుపుకొనేందుకు సర్వం సిద్ధమైంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గ, మండల కేంద్రాలు, పలు ప్రధాన గ్రామాల్లో శుక్రవారం చవితి సందడి నెలకొంది. శనివారం వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు భక్తులు, ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో ఆయా కమిటీల సభ్యులు సర్వం సిద్ధం చేసుకున్నారు. నియోజకవర్గంలో గ్రామగ్రామాన గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ గణపతి ఆలయాలు ఉండగా, అనేక వీధుల్లో ప్రత్యేకంగా ఉత్సవ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయాలను రంగులతో, తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. నవరాత్రుల్లో రంగురంగుల విద్యుద్దీపాల సెట్టింగులు కనువిందు చేయనున్నాయి.

ఈ ఏడాది పౌరాణిక ప్రదర్శనలు

మండలంలోని వాడపాలెంలో మాత్రమే పౌరాణిక రంగస్థల నాటక ప్రదర్శనలు నిర్వహిస్తుండగా, కొత్తపేట కళానగర్, పొట్టి శ్రీరాములు వీధి పందిళ్లలో 9 రోజులు పాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, పౌరాణిక రంగస్థల నాటక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. దీంతో తెరమరుగవుతున్న ఆ కళలకు పూర్వ వైభవం సంతరించుకోనుంది. వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం వినాయక విగ్రహాలు, పాలవెల్లులు, పండ్లు, పువ్వులు, పత్రి, ఇతర పూజా సామగ్రి, వస్త్ర మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. అనేక ప్రధాన గ్రామాల కూడళ్లలో ఆయా దుకాణాలు ఏర్పాటు చేయగా, సందడి నెలకొంది.

ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలు

ఆలమూరు: వర్షాల ప్రభావం గణపతి నవరాత్రులపై పడింది. నవరాత్రి మహోత్సవాల్లో బొజ్జ గణపయ్యకు పూజలు చేసేందుకు భక్తులు పత్రి, పూలు, పండ్లను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. నవరాత్రి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు వాడవాడలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండలంలో సుమారు 150 చోట్ల గణనాథుణ్ణి ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామాల్లో మంటపాల వద్ద చలువ పందిళ్లతో, విద్యుద్దీపాలంకరణతో కళకళలాడుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవ కమిటీలు గణపతి విగ్రహాలను మంటపాలకు తరలించారు. పండ్లు, పూల ధరలు ఆకాశాన్నంటినా భక్తులు కొనుగోలు చేయడం కనిపించింది. మట్టి విగ్రహాలపై ప్రభుత్వం, ఏకరువు పెడుతున్నా, ప్రజల నుంచి అంతంతమాత్రంగానే స్పందన కనిపిస్తోంది. మార్కెట్‌లో మట్టి విగ్రహాలు పూర్తి స్థాయిలో లభించకపోవడంతో, అందుబాటులో ఉన్న విగ్రహాలనే భక్తులు కొనుగోలు చేస్తున్నారు. రసాయన మిళిత విగ్రహాలతో పర్యావరణానికి హాని అని తెలిసినా ప్రజలు మాత్రం పట్టించుకోవడం లేదు.



చవితికి ముస్తాబైన కొత్తపేట కళానగర్ గణపతి ఆలయ ప్రాంగణం

మార్కెట్‌లో సందడి

మామిడికుదురు: వినాయక చవితి సందర్భంగా శుక్రవారం మార్కెట్ కొనుగోలుదారులతో కళకళలాడింది. మండలంలోని అప్పనపల్లి, పాశర్లపూడి, మామిడికుదురు, కొమరాడ, మగటపల్లి, మొగలికుదురు, జగ్గన్నపేట, తదితర గ్రామాల్లోని సెంటర్లలో భారీగా దుకాణాలు వెలిశాయి. భక్తులు ఉత్సాహంగా పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. వినాయకుని ప్రతిమలతో పాటు, పలు రకాల పండ్లు, పత్రి, పువ్వుల దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటి ధరల్లో గతేడాది కంటే పెద్దగా తేడా లేదని భక్తులు పేర్కొన్నారు. నవరాత్ర మహోత్సవాలకు ప్రతి గ్రామంలో భారీ ఏర్పాట్లు చేశారు. వినాయకుని ఆలయాలను, గణపతి పందిళ్లను ముస్తాబు చేశారు. వాటిని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

నాలుగు రోడ్ల సెంటర్‌లో..

అంబాజీపేట: గణేష్ ఉత్సవాలకు అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్ కళకళలాడింది. వినాయక విగ్రహాలు, పాలవెల్లులు, పండ్లు, పువ్వులు, పత్రి, ఇతర పూజా సామగ్రి, వస్త్రాల మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, ముక్కామల తదితర గ్రామాల కూడళ్లలోనూ దుకాణాలు ఏర్పాటు చేశారు. అంబాజీపేటలో విగ్రహాల తయారీదారులు రెండు నుంచి ఆరు అడుగుల విగ్రహాలను మట్టితో తయారు చేశారు.

గ్రామాల్లో చవితి సందడి



అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ సెట్

అయినవిల్లి: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఎటు చూసినా సందడి కనిపిస్తోంది. శుక్రవారం ముక్తేశ్వరంలో వ్యాపార కూడళ్లు కిటకిటలాడాయి. అయినవిల్లి, తొత్తరమూడి, విలస, సిరిపల్లి, నేదునూరు, కొండుకుదురు, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, శానపల్లిలంక తదితర గ్రామాలు గణపతి నవరాత్రులకు సిద్ధమయ్యాయి. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ ప్రాంగణంలో మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాలంకరణతో కాంతులీనుతోంది.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు

మామిడికుదురు: విజయవాడ వరద బాధితులకు పెదపట్నంలంకకు చెందిన షెకీనా ఫెయిత్ హోమ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. హోమ్ నిర్వాహకులు ఇంటి రాజేష్‌బాబు తన సేవకులతో విజయవాడ రాజీవ్‌నగర్ వుడా కాలనీలో బాధితులకు వీటిని పంపిణీ చేశారు.

మట్టి విగ్రహాలను పంచిన విద్యార్థినులు



మట్టి విగ్రహాలు తయారు చేసిన విద్యార్థినులు



విశ్వేశ్వరాయపురంలో మట్టి విగ్రహాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం: మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని మానేపల్లి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు కోరారు. పాఠశాల హెచ్‌ఎం కేవీఎస్ఎన్ మూర్తి, డ్రాయింగ్ టీచర్ పి.వెంకటేశ్వరరావు, క్రాఫ్టు టీచర్ కేవీఎల్ కుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. వీటిని గ్రామస్తులకు పంచారు.

మట్టి విగ్రహాల పంపిణీ

కొత్తపేట: వినాయక చవితి సందర్భంగా ధర్మ సూత్రం ఆధ్యాత్మిక గ్రూపు సభ్యులు భక్తులకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. వాడపాలెం గ్రామానికి చెందిన సింగిరెడ్డి గోవిందుస్వామి, చోడిశెట్టి పవన్ సురేష్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా శుక్రవారం అయినవిల్లి, మడుపల్ల, వానపల్లి, వాడపాలెం, కొత్తపేట తదితర ప్రాంతాల్లో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల ర్యాలీ

మలికిపురం: ఎకో ఫ్రెండ్లీ ప్రతిమలతోనే వినాయక చవితి జరుపుకోవాలని విశ్వేశ్వరాయపురంలో శుక్రవారం వివేకానంద హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు తయారు చేసిన వినాయక మట్టి విగ్రహాలను ప్రదర్శించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



అంబాజీపేటలో భ్రమరాంబిక దేవి దంపతులను సన్మానిస్తున్న నాయకులు



పోతవరం ప్రాథమిక పాఠశాలలో సత్కారం అందుకుంటున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

అంబాజీపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న గంగలకుర్రు అగ్రహారం శివారు ముషిణివారిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కొండ భ్రమరాంబ దేవిని అంబాజీపేటలో ఎస్టీయూ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ సంఘ రాష్ట్ర సంక్షేమ నిధి కన్వీనర్ బోనం గంగాధర్, అధ్యక్ష, కార్యదర్శులు కుంపట్ల సుబ్బారావు, ఎండీఎస్ఎం షరీఫ్, బి.శివ, పీవీఎస్ఎస్ఎస్ మూర్తి తదితరులు ఉన్నారు.

పి.గన్నవరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ముంజవరపుకొట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సరెళ్ల కృపానందాన్ని శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. గత 30 ఏళ్లుగా ఆయన విశేష సేవలు అందిస్తున్నారని పలువురు కొనియాడారు. హెచ్‌ఎం జి.రవికుమార్, సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జంగావారిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాణి శేషగిరిరావు, ముంజవరపుకొట్టు పాఠశాల ఉపాధ్యాయుడు సరెళ్ల కృపానందం, బొమ్మూరు ప్రభుత్వ డైట్ కళాశాలలో పనిచేసిన విశ్రాంత లెక్చరర్ వైఎస్ఎన్ శంకరరావును పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సత్కరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అన్నపూర్ణ

మామిడికుదురు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అన్నపూర్ణ అన్నారు. మామిడికుదురు కాలువ గట్టు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవ సభ జరిగింది. సూపర్‌వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం ఎం.జయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ కె.శిరీష, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

మలికిపురం: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కవరం మంగెన గురయ్య విద్యాసంస్థల ప్రాంగణంలో గురు పూజోత్సవం, వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు.

21 రకాల పూజా పత్రి పంపిణీ

కొత్తపేట: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) ఉచితంగా 21 రకాల పూజా పత్రి పంపిణీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా వినాయకచవితికి ఏ పత్రితో పూజించాలని వివరిస్తూ సుమారు 200 మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక 21 మందికి మాత్రమే పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. అవి 1 మాచిపత్రి, 2 వాకుడు, 3 మారేడు, 4 గరిక, 5 ఉమ్మెత్త, 6 రేగు, 7 ఉత్తరేణి, 8 తులసి, 9 మామిడి, 10 కరివీరు, 11 దానిమ్మ, 12 దేవదారు, 13 మరువం, 14 వావిలి, 15 దేవకాంచనం, 16 జమ్మి, 17 రావి, 18 తెల్లమద్ది, 19 జిల్లేడు, 20 విష్ణుకాంత, 21 జాజి పత్రి అని వివరించారు.

ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ సాయం



విజయవాడ తరలివెళ్లిన సంస్థ సభ్యులు

అంబాజీపేట: విజయవాడ వరద బాధితులకు అంబాజీపేటకు చెందిన ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ సంస్థ సాయం అందించింది. గురువారం రాత్రి మినీ వ్యాన్‌లో ఆహార పదార్థాలు తీసుకువెళ్లి విజయవాడలో వరదల్లో చిక్కుకుపోయిన సింగ్‌నగర్, వాంబే కాలనీ తదితర కాలనీ వాసులకు వాటిని అందజేశారు. సుమారు 10 వేల మందికి వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్లు, పాలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ఆత్రేయపురం: మట్టి వినాయకుడిని పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని హిందూ ధర్మ పరిరక్షణ నిర్వాహకులు అన్నారు. శుక్రవారం ర్యాలి గ్రామంలో శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి 500 మట్టి వినాయకుని విగ్రహాలను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్యకు సంస్థ ప్రతినిధులు అందజేశారు.

ఆలమూరు: జొన్నాడలో మట్టి విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు. స్థానిక శ్రీద్వారంపూడి సత్యనారాయణరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఈ విగ్రహాలతో పాటు, వినాయక వ్రత కల్పం పుస్తకాలను గ్రామస్తులకు అందజేశారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ మెర్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆత్రేయపురం: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాతి బుజ్జి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐ విద్యాసాగర్ మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండో ద్వారా అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక చవితి పందిళ్ల వద్ద వివాదాలు తలెత్తకుండా ఉత్సవ కమిటీ పెద్దలు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.

పండ్ల ధరలు భగభగ



కొత్తూరులో వినాయక చవితి సందర్భంగా పండ్లు, పూలు విక్రయిస్తున్న వ్యాపారి

ఆలమూరు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా మట్టి విగ్రహాలు, పూజా సామగ్రి పాలవెల్లికి అమర్చే పండ్ల, పూల ధరలు భగభగమండాయి. ఒక్కొక్క పాలవెల్లికి కావలసిన యాపిల్, ద్రాక్ష, మారేడు, వెలక్కాయ, సీతాఫలం, అరటిపండ్లు, కలువ పువ్వు ధరలు ఆకాశాన్నంటాయి. పత్రిని కూడా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రావడంతో, కేవలం పూజా సామగ్రికే రూ.వెయ్యి వరకు ఖర్చయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్లే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

రెండోసారి.. వరద ముంచెత్తి..

- నీట మునిగిన అప్పనపల్లి కాజ్‌వే
- ప్రజలకు తప్పని అవస్థలు
- ట్రాక్టర్లపై సాగిస్తున్న రాకపోకలు



ముంపు బారిన పడిన అప్పనపల్లి కాజ్‌వే



టేకిశెట్టిపాలెంలో ఆంజనేయ స్వామివారి ఆలయం వైపు పోటెత్తిన వరద

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతి ఈ ఏడాది రెండోసారి లంక గ్రామాలను ముంచెత్తింది. దీంతో అనేక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను శుక్రవారం వరద నీరు ముంచెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ నాలుగడుగుల మేర వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నం గామంతో పాటు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార కాలనీలను వరద చుట్టుముట్టింది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపు బారిన పడింది. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో కొబ్బరి కాయలు దింపు తీసి రెండెడ్ల బళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవడంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎండుగడ్డి ముంపు భారిన పడకుండా భవనాలపై దాచుకున్నారు. గోదావరి వరద మరింత పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం జిల్లా భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో తీర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఉధృతంగా నదీ పాయలు

పి.గన్నవరం: భద్రాచలం వద్ద వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టినప్పటికీ, కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడ పడవలను ఏర్పాటు చేశారు. మానేపల్లి శివారు శివాయలంకకు వేళ్లే రహదారి మునిగిపోవడంతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు సుమారు రెండు కి.మీ. మేర ట్రాక్టర్‌పై ప్రయాణించి మానేపల్లికి వస్తున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిలంక, బూరుగులంకలతో పాటు, ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రా వారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై బయటకు వస్తున్నారు. పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవి ట్రాక్టర్‌పై శివాయలంకకు వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించారు.



అప్పనరామునిలంక, సఖినేటిపల్లి గ్రామాల మధ్య కాజ్‌వేపై గోదావరి పాయ వరద ఉధృతి



వారం రోజులుగా ముంపు నీటిలో ఉన్న పాదలాడ కంచికామాక్షమ్మ కాలనీ

చుట్టు ముట్టిన వరద

సఖినేటిపల్లి: ధవళేశ్వరం వద్ద తొలి ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో శుక్రవారం మండలంలో అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల పరిధిల్లోని గోదావరి పాయను అనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాలను, కొబ్బరి తోటలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల మధ్య గోదావరి పాయపై నూతనంగా నిర్మించిన కాజ్ వే వద్ద, అలాగే అప్పనరామునిలంక, సఖినేటిపల్లి గ్రామాల మధ్య మరో కాజ్ వే వద్ద పోటెత్తిన వరదతో ఆయా మార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. అప్పనరామునిలంక వాసులు రామరాజులంక మీదుగా ఉన్న మరో మార్గంలో ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి పాయను ఆనుకుని టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీకి, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయం వైపున కూడా వరద నీరు పోటెత్తింది.

ముంపు నీటిలో జనం బెంబేలు

రాజోలు: వారం రోజులుగా పలు కాలనీలను ముంపు పట్టిపీడిస్తోంది. భారీ వర్షాలతో కాలనీల్లో వర్షపు నీరు ఎటూ వెళ్లక ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. మండలంలోని పాదలాడ కంచికామాక్షమ్మ కాలనీ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మోకాలు లోతు నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. ఆకుల వారి వీధి, శ్రీకొత్తవేంకటేశ్వరస్వామివారి వీధి, మట్టావారి వీధి, సుందరమ్మ చెరువు గట్టు ప్రాంతాలు పూర్తిగా ముంపులోనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఇంజిన్ల సాయంతో ముంపునీరు తోడుతున్నారు. శివకోడు 18 ఎకరాల కాలనీలో రోడ్లు పూర్తిగా జలమయమైంది. పారిశుధ్యం క్షీణించి అనేక మంది జ్వరాల బారిన పడ్డారు.